సాక్షి వికారాబాద్

ఆదివారం । 9 । మార్చి । 2025




షూటింగ్‌లో అపశ్రుతి

సినిమా షూటింగ్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. 8లో▸



సీపీఎస్ రద్దుకు డిమాండ్

సీపీఎస్‌ను రద్దు చేయాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి కోరారు. 8లో▸



న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జడ్జి నాగుల శిల్ప తదితరులు

పరిగి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, పథకాలు అర్హులకు అందేలా చూడాలని కోరారు. మహిళల సంక్షేమానికి తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ఏజీపీ బాలముకుందం, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాములు, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఎంసెట్‌లో ఉచిత శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బస్వరాజ్ తదితరులు

తాండూరు టౌన్: హిందూ ధార్మిక పరిషత్, సేవా భారతి ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా ఎప్‌సెట్(ఎంసెట్) శిక్షణ ఇవ్వనున్నట్లు పరిషత్ తాండూరు కన్వీనర్ గాజుల బస్వరాజ్ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియేట్ పూర్తి చేసుకున్న బాలికలకు ఈనెల 23వ తేదీ నుంచి స్థానిక భాష్యం జూనియర్ కళాశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఇందుకు ఈనెల 22వ తేదీ లోపు రూ.500 చెల్లించి అడ్మిషన్ పొందాలన్నారు. శిక్షణకు హాజరయ్యే బాలికలకు ఉచితంగా ఎప్‌సెట్ స్టడీ మెటీరియన్ అందివ్వనున్నట్లు తెలిపారు. ప్రవేశాల కోసం సెల్ నంబర్ 9290082155, 9030056755లలో సంప్రదించాలన్నారు. కావున బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో నరేందర్, వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్, పర్యాద రామకృష్ణ, రాము, రమేష్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌కు 560 బస్తాల కందులు

ధారూరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 560 బస్తాల కందులు వచ్చాయని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. కందులు తక్కువగా క్వింటాలుకు రూ.7,100, మధ్యస్తంగా రూ.7,250, అధికంగా రూ.7,340 వరకు అమ్మకాలు జరిగాయని పేర్కొన్నారు. వేరుశెనగ 218 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు తక్కువగా రూ.5,650, మధ్యస్తంగా రూ.6,240, ఎక్కువగా రూ.6,370 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అలాగే మొక్కజొన్న 90 బస్తాలు వచ్చాయని క్వింటాలు రూ.2,200 నుంచి రూ.2,400 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

నేడు ఇండియాకు ప్రవీణ్‌కుమార్ మృతదేహం



కేశంపేట: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన గంప ప్రవీణ్‌కుమార్ మృతదేహం ఆదివారం ఇండియాకు రానుంది. మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్ బుధవారం అమెరికాలోని మిల్వాకీ పట్టణంలో దుండగుల కాల్పులో మృతి చెందిన సంగతి తెలిసిందే. అమెరికాలో పోస్టుమార్టంతో పాటు లాంచనాలు పూర్తికావడంతో మృతదేహాన్ని తానా సభ్యులు, బంధువుల సహకారంతో ఇండియాకు తరలించారు. ఆదివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రానున్నట్టు బంధువులు, గ్రామస్తులు తెలిపారు.



తాండూరు టౌన్: మహిళా పోలీసులను సన్మానించిన అధికారులు



నవాబుపేట: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు



యాలాల: పగిడియాల గ్రామంలో మహిళలను సన్మానించిన గ్రామస్తులు



కుల్కచర్ల: మహిళా అధికారులను సన్మానిస్తున్న నేతలు

ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వికారాబాద్ ఆర్టీసీ బస్టాండ్ డిపోలో డీఎం అరుణ ఆధ్వర్యంలో సంబురాలు జరిగాయి. పలుచోట్ల మహిళా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పట్టణంలో జరిగిన వేడుకల్లో ఎస్‌ఐ విమల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు పల్లవి ఆధ్వర్యంలో సంబురాలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

– అనంతగిరి



తాండూరు రూరల్: కొత్లాపూర్ పాఠశాలలో మహిళా సిబ్బందిని సన్మానించిన సిబ్బంది

రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి
- లోక్ అదాలత్‌లో 1,631 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ కోర్టుల పరిధిలో మొత్తం 1,631 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లు అన్ని కోర్టుల్లో కొనసాగుతాయన్నారు. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే కేసుల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని తెలిపారు. ప్రతి వ్యక్తీ చట్టాలపై కనీస అవగాహన ఉండాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, ఎస్పీ నారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, పీపీలు అన్వేషింగ్, సమీనాబేగం, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేసి మంచిపేరు తెండి

ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో సిబ్బంది, అధికారులు బాధ్యతగా పనిచేసి పోలీసు శాఖకు మంచిపేరు తేవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఏఆర్ పోలీసులతో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ అనేది క్రమశిక్షణకు మారుపేరన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. ముఖ్యమైన విధుల్లో సమయపాలన పాటించడంతో పాటు నీట్ టర్న్ ఔట్ అనుసరించాలన్నారు. సిబ్బంది సమస్యలు తెలుసుకునేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని మహిళా అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, డబ్ల్యూ పీసీలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటం

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య

షాద్‌నగర్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని నిర్వహిస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. శనివారం పట్టణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బసవ పున్నయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆయన ఆరోపించారు.

బలవంతపు భూసేకరణ చేస్తే..

మరో పోరాటం తప్పదు

- మండలంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



లగచర్ల గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న సంఘం నాయకులు

దుద్యాల్: పరిశ్రమల పేరిట రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవాలని ప్రయత్నిస్తే మరో పోరాటం తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు అన్నారు. శనివారం మండలంలోని లగచర్ల గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లగచర్ల, హకీంపేట్, రోటిబండ తండా, పులిచర్ల కుంట తండా, పోలేపల్లి గ్రామాల రైతులు అంగీకరిస్తేనే పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాకాకుండా బలవంతంగా, బెదిరించి భూములు తీసుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. అలాగే మండలంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, జిల్లా నాయకులు సత్తయ్య, సీ సత్యయ్య, రైతు బసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాండూరు రూరల్: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ నారా యణరెడ్డి అన్నారు. ఎల్ఎస్ఆర్ యువసేన, హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపాదించిన దాంట్లో కొంత భాగం పేదలకు సేవ చేయడం సంతోషకరమైన విషయమన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకోవాలంటే లక్షల్లో ఖర్చు అవుతున్న సందర్భంలో ఎల్ఎస్ఆర్ యువసేన, శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయడం అభినందనీయమన్నారు. 300మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 50 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి హైదరాబాద్ తరలించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు లొంక నర్సింలు, కోఆప్షన్ మాజీ సభ్యుడు నసీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు లాల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సంగమేశ్వర్, బిచ్చన్న, బీ నర్సింలు, నాగభూషణం, రవి, రామకృష్ణ, రాములు, ప్రవీణ్, రాము జాదవ్ పాల్గొన్నారు.

అప్పుడే వేఢీ

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

షాబాద్: మార్చిలోనే భానుడు భగ్గుమంటున్నాడు. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి. వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం పది గంటలు దాటిందంటే చాలు రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.గతేగాదితో పోల్చితే ఎండలు ఎక్కువగానే ఉన్నాయి.జనం బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు.ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లతో పాటు ఆఫీసుల్లో వేసవి నేస్తాలను సమకూర్చుకుంటున్నారు. శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా నమోదవుతూ ఉంటుంది. మరో రెండున్నర నెలల పాటు వేసవి కాలం ఉండగా ప్రస్తుత ఉష్ణోగ్రతలను చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశ ముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

భిన్నమైన వాతావరణం

ఈ సీజన్ వేసవి ప్రారంభం నుంచి కూడా భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. శీతాకాలం మాదిరిగానే రాత్రివేళ చలి వణుకు పుట్టిస్తోంది. వేకువజామున మంచు తెరలు వీడడం లేదు. 10 గంటల దాటిందంటే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. వారం రోజులుగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు.

వైద్య నిపుణుల సూచనలు..

- చల్లటి నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.
- ఎండలో ముదురు రంగు, నలుపు దుస్తులు వాడరాదు.
- లేత రంగులు కలిగి తేలికైన వదులు దుస్తులు వాడాలి.
- రోడ్ల మీద అమ్మే వేడి పదార్థాలను తగ్గించాలి.
- దోస, పుచ్చ, తాటి ముంజలతో పాటు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.
- మద్యం తాగరాదు.మాంసాహారాన్ని తగ్గించాలి.
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, రుమాలు, తలపాగాలు ధరించాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్ర 5 గంటల వరకు చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండలో తిరగకుండా నీడ పట్టున ఉంటే మంచిది.



కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తజనం

కల్యాణం.. కమనీయం

నవాబుపేట మండలం ఎల్లకొండ ఆలయంలో పార్వతీపరమేశ్వరల కల్యాణం శనివారం కనుల పండువగా సాగింది. ఈ వేడుకను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అంతకుముందు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఆలయ కమిటీ చైర్మన్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు ముకుంద్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, సుదర్శన్, కొండయ్య, గాలయ్య, ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరమ్మ, విశ్వేశ్వర్‌స్వామి, చంద్రశేఖర్‌స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

– నవాబుపేట



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

క్లుప్తంగా

‘మిలియన్ మార్చ్’డే ను విజయవంతం చేయండి


మిలియన్ మార్చ్ డే పోస్టర్ విడుదల చేస్తున్న టీజేఎఫ్ నాయకులు

కొడంగల్ రూరల్: మిలియన్ మార్చ్ డే ను విజయవంతం చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్(టీజేఎఫ్) రాష్ట్ర కో కన్వీనర్ కన్నోజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ప్రతీ నెల రూ.30వేల గౌరవ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్వతంత్ర సమరయోధుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని కోరారు. మార్చి 10న హైదరాబాద్‌లో జరగనున్న మిలియన్ మార్చి డేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేశం, నవీన్, సిద్దు, వినయ్, విజయ్‌కుమార్, తేజ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


చంద్రాయన్‌పల్లిలో మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్న యువత

మోమిన్‌పేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని చంద్రయాన్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బషీర్ కుటుంబ సభ్యులు ఉదయం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానిక యువకులు మంటలార్పేందుకు యత్నించారు. ఇంట్లోని నిత్యావసర సరుకులు, దుస్తులు, రూ.లక్ష నగదు దగ్ధమైనట్లు బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

తాండూరు రూరల్: చోరీ కేసులో నిందితుడి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో జినిగే వెంకట్‌రెడ్డి ఇంట్లో ఫిబ్రవరి 28న గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గ్రామానికి చెందిన గోపాల్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మూడు టిప్పర్లు సీజ్

కేశంపేట: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను శనివారం పోలీసులు సీజ్ చేశారు. సీఐ నరహరి తెలిపిన ప్రకారం.. పోతుల ప్రసాద్ ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడ నుంచి నిబంధనలకు విరుద్ధంగా మహేశ్వరం మండలం దుబ్బచర్లకు మట్టి తరలిస్తున్నాడు. పోలీసులు పెట్రోల్ నిర్వహిస్తుండగా మంగళిగూడ వద్ద మూడు టిప్పర్లలో మట్టి తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలు ఆపారు. ఇద్దరు డ్రైవర్లు పరారవగా ఓ డ్రైవర్ పోలీసులకు చిక్కాడు. డ్రైవర్ సూర్యను విచారించి టిప్పర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ శ్రీశైలం ఫిర్యాదు మేరకు ప్రసాద్, టిప్పర్ డ్రైవర్ సూర్య, పారిపోయిన డ్రైవర్లు సంతోష్, ప్రతాప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు ట్రాక్టర్లు

మాడ్గుల: మండల పరిధిలోని అప్పారెడ్డి పల్లి, నర్సాయిపల్లి శివారులో కెఎల్-183 కాలువ నుంచి శనివారం అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ వేణుగోపాల్ రావు తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ప్రశ్నించగా ఎలాంటి అనుమతులు లేవని చెప్పడంతో వాటిని సీజ్ చెసినట్లు చెప్పారు. డ్రైవర్లు, వాహన యాజమనులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సినిమా షూటింగ్‌లో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మృతి
- మృతదేహాన్ని మార్చురీకి తరలించిన పోలీసులు
- సమాచారం ఇవ్వలేదని మృతుడి కుటుంబీకుల ధర్నా
- ఏసీపీ రమణగౌడ్ జోక్యంతో ఆందోళన విరమణ


ధర్నా చేస్తున్న మృతుడి భార్య లావణ్య, కూతురు శిరీష తదితరులు


శంభారెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: ఓ సినిమా షూటింగ్‌లో అపశ్రుతి చోటు చేసుకుంది. ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి మండల పరిధిలోని టంగుటూరు శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. టంగుటూరుకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీజేపీ నేత బద్దం శంభారెడ్డి(47) సిని ఇండస్ట్రీ వారికి సుపరిచితుడు. మండల పరిధిలో చేసే షూటింగ్‌లకు అనుమతులు ఇప్పిస్తుంటాడు. కాగా శుక్రవారం గ్రామ శివారు పంట పొలాల్లో ‘ఓదేల.. ది రైల్వేస్టేషన్’ సినిమా షూటింగ్ ఉంది. షూటింగ్ బృందానికి చెందిన ఓ భారీ క్రేన్ రావడంతో విద్యుత్ వైర్లకు తగులుతుందేమోనని శంభారెడ్డి ట్రాన్స్‌ఫార్మర్(జంపర్)ను ఆఫ్ చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. షూటింగ్ బృందం వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా రాత్రి విధుల్లో ఉన్న పెట్రోలింగ్ వాహనంలో సిబ్బంది, నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య లావణ్య, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే మణివర్ధన్‌రెడ్డి, శిరీష ఉన్నారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మోకిల ఠాణాలో మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు సూచించారు.

రెండు గంటల పాటు ధర్నా

కాగా పోలీసులు సినీ ఇండస్ట్రీ వారితో కుమ్మక్కై ఆధారాలు లభించకుండా మృతదేహాన్ని మార్చురీకీ తరలించారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు ఘటనాస్థలికి వెళ్లగా.. ఎవరికీ చెప్పొద్దంటూ వెనక్కి పంపించారని వాపోతున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా తరలిస్తారంటూ శనివారం మోకిల చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వాహనాల దారి మళ్లించారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం ధర్నాకు మద్దతు తెలిపారు. అనంతరం నార్సింగి ఏసీపీ రమణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఎమ్మెల్యే పరామర్శ

శంభారెడ్డి మరణవార్త తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మృతుడి ఇంటికి వెళ్లారు. వారికి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించారు.

80 కేసులకు పరిష్కారం


లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న మున్సిఫ్‌కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీరామ్

కొడంగల్ రూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తోందని మున్సిఫ్ కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీరామ్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పలు సూచనలు ఇచ్చారు. పేదలకు కోర్టు ఖర్చుల భారం లేకుండా లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కారం అయ్యేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాజీ మార్గమే రాజ మార్గం అన్నారు. కోర్టు సమయాన్ని వృథా చేయకుండా అవగాహనతో రాజీతో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఎక్సైజ్‌కు సంబంధించి 40, డ్రంకెన్‌డ్రైవ్ 32, నేరం అంగీకరించినవి నాలుగు, మరో నాలుగు క్రిమినల్ కేసులతో మొత్తం 80 కేసులను పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు బస్వరాజు, బాగ్యలత, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, సీనియర్ న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, కృష్ణ, మొహీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఏదైనా సాధ్యం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డీజీ శీతల్


మాట్లాడుతున్న న్యాయమూర్తి డీజీ శీతల్

అనంతగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులతో కలిసి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీజీ శీతల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రతీ ఒక్కరు అమ్మాయిలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. విద్యతోనే అన్నీ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి వెంకటేశ్, న్యాయవాదులు వసుంధర, పద్మలత, జయలతారెడ్డి, శ్రీలత, సుమలత, పూజ, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.




పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ ఐస్ క్రీంలు, తయారీ సామగ్రి

కల్తీ ఐస్‌క్రీం కలకలం

- తయారీ కేంద్రంపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి
- ఐస్‌క్రీంలు, సామగ్రి స్వాధీనం
- నిర్వాహకుడికి రిమాండ్

మహేశ్వరం: ఎలాంటి అనుమతులు లేకుండా.. నాణ్యత పాటించడకుండా కల్తీ ఐస్‌క్రీంలు తయారీ కేంద్రంపై మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. మహేశ్వరం సీఐ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ కొంతకాలంగా పోచమ్మ బస్తీ సమీపంలో ఐస్‌క్రీం తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఐస్ క్రీం ప్యాకెట్స్, డబ్బాలపై ఎక్స్‌పెయిరీ తేదీ లేకుండా కల్తీ వస్తువులు, రంగులు, రసాయనాలు వాడి తయారు చేస్తున్నట్లు మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌ఓటీ పోలీసులు తయారీ కేంద్రంపై దాడి చేసి నిర్వాహకుడిని అరెస్ట్ చేసి ఐస్‌క్రీం తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అహ్మద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

అదుపుతప్పిన బైక్

డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

మొయినాబాద్: బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చిలుకూరుకు చెందిన ఈడిగి శ్రీకాంత్‌గౌడ్(19) శుక్రవారం రాత్రి హిమాయత్‌నగర్‌లో స్నేహితుడి వివాహానికి బైక్‌పై వెళ్లాడు. శనివరం తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచా రం అందుకున్న పోలీసుఏలు ఘటనా స్థలికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అడ్డాపై కూలీ మృతి

తుర్కయంజాల్: కూలి పనికి వెళ్లిన వ్యక్తి లేబర్ అడ్డాపై మృతి చెందాడు. ఈఘటన తుర్కయంజాల్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. మిర్యాలగూడకు చెందిన వెంకటయ్య(50) దంపతులు తుర్కయంజాల్‌లో నివాసం ఉంటూ రోజువారి కూలీపనుల కోసం అడ్డామీదకు వెళ్తారు. శనివారం ఉదయం కూలీకోసం దంపతులు అడ్డామీదకు వెళ్లారు. అక్కడ చేరుకున్న కాసేపటికే వెంకటయ్య ఒక్కసారిగా కుప్పకూలాడు. గుండెపోటుతో మృతి చెందాడని నిర్ధారించుకున్నారు. మృతదేహాన్ని తరలించేందుకు డబ్బు లేకపోవడంతో దాతలు స్పందించి రూ.7వేలు పోగు చేసి ఆటో వారి స్వగ్రామానికి తరలించారు.

సీపీఎస్ రద్దుకు డిమాండ్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

కొడంగల్: సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన పలు పాఠశాలల్లో ఉద్యోగులతో కలిసి సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో పోస్టర్లను ఆవిష్కరించారు. ఫ్యామిలీ పెన్షన్ లోపాలు, ప్రభుత్వం చెల్లించే మ్యాచింగ్ గ్రాంట్స్ జమ కాకపోవడం తదితర అంశాలను పరిష్కరించాలని కోరారు. సీపీఎస్‌ను అంతరం చేసి పాత పెన్షన్ అమలయ్యే వరకు నిరంతరం పోరాడుతామని హెచ్చరించారు. ఉద్యోగులంతా సంఘటితమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉపాధ్యక్షుడు అశోక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృత్యువాత

కేశంపేట: వీధి కుక్కల దాడిలో ఓ లేగదూడ మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గుండు శ్రీనివాసులుది వ్యవసాయాధారిత కుటుంబం. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి తన పశువులను పొలం వద్ద ఉన్న షెడ్‌లో ఉంచి ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఆయన పొలానిక వెళ్లగా లేగదూడ చనిపోయి ఉంది. కుక్కల దాడిలోనే లేగదూడ మృతి చెందిదని గ్రామస్తులు తెలిపారు. మూడు నెలల క్రితం ఓ లేగదూడను కుక్కలు దాడి చంపేసాయని గ్రామస్తులు వెల్లడించారు.

ఆలయంలో విగ్రహాలు మాయం

- బీజేపీ, హిందూ సంఘాల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు
- మతిస్థిమితం సరిగా లేని ఏఎన్‌ఎం తీసినట్లు చెబుతున్న వైద్య సిబ్బంది


ఆలయం వద్ద బీజేపీ, హిందూ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

మొయినాబాద్: ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఆలయంలోని మైసమ్మ, కనకదుర్గ అమ్మవార్ల విగ్రహాలు మాయమయ్యాయి. ఈ ఘటన మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. మొయినాబాద్ ప్రభుత్వాస్పత్రిలో ఓ పురాతన ఆలయం ఉంది. అందులో మైసమ్మ, కనకదుర్గ అమ్మవార్ల విగ్రహాలున్నాయి. శనివారం ఉదయం ఆస్పత్రికి వచ్చినవారికి ఆలయంలో విగ్రహాలు కనిపించకపోవడంతో ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో బీజేపీ, హిందూ సంఘాల నాయకులు ఆలయం వద్దకు చేరుకుని ఆందోళనకు చేపట్టారు. ఆస్పత్రి సిబ్బందిని నిలదీశారు. ఆసుపత్రిలో పనిచేసే ఓ ఏఎన్‌ఎం కొత కాలంగా మతిస్థిమితం సరిగాలేక పూనకంతో ఊగిపోతోందని.. ఆలయానికి ఉన్న టైల్స్‌ను కొంత కాలంగా తానే తొలగించిందని.. విగ్రహాన్ని సైతం ఆమె మాయం చేసి ఉండవచ్చని సిబ్బంది చెప్పారు. ఈ విషయంపై బీజేపీ, హిందూ సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని సర్ది చెప్పారు.


మొయినాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఆలయం

మానసిక రోగంతోనే..

పీహెచ్‌సీలో పనిచేసే గంగా అనే ఏఎన్‌ఎం మానసిక పరిస్థితి కొంత కాలంగా సరిగా లేదు. ఆలయం వద్ద పూజలు చేస్తూ పూనకంతో ఊగిపోతుంది. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ తెప్పిస్తే సిబ్బందిని బూతులు తిడుతూ కర్రలతో దాడి చేసింది. ఎవరైనా దగ్గరకు వస్తే చనిపోతానని బెదిరిస్తుంది. మతిస్థిమితం సరిగా లేని గంగా విగ్రహాలను తొలగించి ఉంటుందని భావిస్తున్నాం.

– అన్నపూర్ణ, వైద్యాధికారి, మొయినాబాద్


ప్రత్యేక అథారిటీ కేంద్రం కానున్న మీరాఖాన్‌పేట గ్రామం

ప్రత్యేక అథారిటీలోకి ఆ గ్రామాలు!

యూడీఏలోకి ‘పట్నం’ డివిజన్‌లోని 28 రెవెన్యూ గ్రామాలు

- అత్యధికంగా యాచారం మండలం నుంచి 17
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- మరింతగా అభివృద్ధి చెందే అవకాశం
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ

యాచారం: ఫ్యూచర్‌సిటీ నిర్మాణంలో భాగంగా సర్కార్ ప్రతిపాదించిన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)లోకి ఇబ్రహీంపట్నం డివిజన్ నుంచి 28 రెవెన్యూ గ్రామాలను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. యాచారం మండలం నుంచి అత్యధికంగా 17, ఇబ్రహీంపట్నం మండలం నుంచి 8, మంచాల మండలం నుంచి 3 గ్రామాలను యూడీఏలోకి తీసుకోవడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి సర్కార్‌కు అందజేశారు. యాచారం మండలంలో 20 రెవెన్యూ గ్రామాలుండగా మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్ మినహా మిగతా గ్రామాలను యూడీఏలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. కందుకూరు మండలం మీరాఖాన్‌పేట కేంద్రంగా ఏర్పాటు చేసే యూడీఏలో ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని 28 రెవెన్యూ గ్రామాలు, వాటి అనుబంధ గ్రామాలను కలిపి అభివృద్ధి చేయడానికి సర్కార్ దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రత్యేక అథారిటీకి సర్కార్ ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో ప్రజాభిప్రాయాలు.. మార్పులు, చేర్పుల కోసం కొన్ని రోజుల పాటు అభ్యంతరాలకు అవకాశం ఇవ్వొచ్చని రెవెన్యూకు చెందిన ఓ ఉన్నతాధికారి ‘సాక్షి’తో తెలిపారు.

రియల్ పుంజుకునే అవకాశం

మీరాఖాన్‌పేట కేంద్రంగా ఏర్పాటు చేసే ప్రత్యేక అథారిటీతో ఆయా గ్రామాల్లో రియల్ వ్యాపారం జోరందుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూములు అమాంతం పెరిగాయి. ప్రత్యేక అథారిటీ ఏర్పాటైతే ధరలు మరింత పెరుగుతాయనే ఆశతో రైతులెవరూ తమ వ్యవసాయ భూములు అమ్ముకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

స్థానిక ఎన్నికలపై ఉత్కంఠ

ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేస్తే ఆ పరిధిలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయా.. ఉండవా అనే దానిపై చర్చలు నడుస్తున్నాయి. కొందరు అధికారులు ఎన్నికలకు ఏ ఇబ్బందీ లేదంటుండగా, మరి కొందరు మాత్రం జీహెచ్‌ఎంసీ పరిధిలో మాదిరిగానే కార్పొరేటర్ ఎన్నికలు ఉండొచ్చనే సంకేతాలు ఇస్తున్నారు. దీంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

యూడీఏ కింద తీసుకునే గ్రామాలు

ఇబ్రహీంపట్నం: కప్పపహాడ్, పోచారం, రాంరెడ్డిగూడ, తులేకలాన్, తుర్కగూడ, ఎలిమినేడు, ఎర్రకుంట, తడ్లకాల్వ.
మంచాల: ఆగాపల్లి, నోముల, మల్లికార్జునగూడ.
యాచారం: చౌదర్‌పల్లి, గునుగల్, కొత్తపల్లి, కుర్మిద్ద, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, నక్కర్త, మొగుళ్లవంపు, నానక్‌నగర్, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తక్కళ్లపల్లి, తాడిపర్తి, చింతుల్ల, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి.


మొండిగౌరెల్లిని కలపాలి



ప్రత్యేక అథారిటీలో మొండిగౌరెల్లి గ్రామాన్ని కూడా కలపాలి. యాచారం మండల కేంద్రానికి ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న చింతపట్ల, మాల్, నల్లవెల్లి గ్రామాలను తీసుకుంటారని తెలుస్తోంది. నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న మొండిగౌరెల్లిని గుర్తించకపోవడం సరైంది కాదు.

– తాండ్ర రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు, యాచారం

భూములు అమ్మడం లేదు



ప్రత్యేక అథారిటీతో ఈ ప్రాంతంలో ఊహించని అభివృద్ధి జరుగుతుందని అంటున్నారు. నాగార్జున సాగర్-హైదరాబాద్ రహదారి వెంట ఉన్న గ్రామాల్లో ఇప్పటికే భూముల ధరలు పెరిగాయి. భవిష్యత్తులో మరింత పెరుగుతాయంటున్నారు. ప్రస్తుతం ఎవరూ అమ్మేందుకు ఆసక్తి చూపించడం లేదు.

– కర్నాటి భూపతిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



ప్రత్యేక అథారిటీ కింద గ్రామీణ ప్రాంతాలను తీసుకోవడం సంతోషకరమే. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు యథావిధిగా నిర్వహించాలి. ఇప్పటికే గ్రామాల్లో పాలన పూర్తిగా కుంటు పడిపోయింది. యాచారం మండలంలో మూడు గ్రామాలు మినహా అన్నీ అథారిటీలోకి వెళ్లే అవకాశం ఉంది.

– బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, నందివనపర్తి

విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రావీణ్యం సాధించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జంపన్నగౌడ్

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని జాతీయ వాలీబాల్ ప్లేయర్ బి.జంపన్నగౌడ్ అన్నారు. జేబీ ఇంజనీరింగ్ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణారావు, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, డైరెక్టర్ సంజయ్, విజయ్ రాఘవ్, పీడీ విఘ్నేష్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతికి కారణమైన వ్యక్తికి రిమాండ్

కేశంపేట: అజాగ్రత్తగా కారు నడిపి వృద్ధురాలి మృతికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం మండలం నాగారానికి చెందిన రబియాబి(80) సొంతూరుకు వెళ్లేందుకు బైర్కాన్‌పల్లి శివారులో శుక్రవారం సాయంత్రం బస్సుకోసం నిరీక్షిస్తోంది. ఈ క్రమంలో బైర్కాన్‌పల్లికి చెందిన చంద్రశేఖర్ తన కారుతో వృద్ధురాలిని ఢీకొట్టాడు. ఆమె తీవ్రంగా గాయపడడంతో కుటుంబీకులు శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందింది. వృద్ధురాలి మృతికి కారణమైన చంద్రశేఖర్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.